ఉపాధ్యాయునిపై ఫిర్యాదు

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో వైసిపి పార్టీకి చెందిన ఉపాధ్యాయుడు ఎన్నికల ఏజెంట్‌గా వెళ్లినందుకు సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు ఆధ్వర్యాన జాయింట్ కలెక్టర్, తహశీల్దారులకు లిఖిత పూర్వకంగా, ఫోన్‌లో ఫిర్యాదులు చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, వైసిపికి చెందిన ఎగుబంది ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు గుణ్యాం. త్రినాథ్ ఎన్నికల ఏజెంట్‌గా వివరిస్తూ దొంగ ఓట్లను వేయించడం తగదన్నారు. ఉపాధ్యాయుడిని ఉద్యోగ బాధ్యత నుండి పూర్తిగా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కె. మొస్య, గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎస్.నాగులు, కార్యకర్తలు జె.రామన్న పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నేతలు

మండలి ఎన్నికలు ప్రశాంతం

పాడేరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- -పాడేరు డివిజన్‌లో 72.56 శాతం పోలింగ్
- -ఓటు వేసిన 8,362 మంది పట్టభద్రులు
- -ఓట్లు నమోదు కాకపోవడంతో ఉపాధ్యాయుల నిరాశ
- -పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా

ప్రజాశక్తి-యంత్రాంగం

అల్లూరి జిల్లాలోని పాడేరు ఏజెన్సీలో సోమవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 11 మండలాల్లోని ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి పట్టభద్రులు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగక పోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

పాడేరు: పాడేరులో పోలింగ్ ఉదయం మందకొడి గానే పోలింగ్ సాగింది. మధ్యాహ్నం 12గంటల సమయానికి పోలింగ్ కేవలం 20.80శాతం మాత్రమే జరిగింది. ఆ తర్వాత పలువురు మధ్యాహ్నం సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం రెండు గంటలు దాటేసరికి పోలింగ్ పుంజుకుంది. అప్పటికి పోలింగ్ 46.38 శాతానికి పెరిగింది. 4 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. డుంబ్రిగుడ మండల కేంద్రంలో పోలింగ్ సమయం దాటిన తర్వాత కూడా ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు.జిల్లా కేంద్రంలోని పాడేరు లో పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ, బీజేపీ పార్టీల నాయకుల హడావిడి కనిపించింది. బయట శిబిరాలు ఏర్పాటు చేసి సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపించారు.

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు, మాజీ ఎమ్మెల్యే గిడ్డీశ్వరి పాడేరులో పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాడేరులోని రెండు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన పలువురు పట్టభద్రులు తమ ఓట్లు లేవని నిరాశతో వెనుదిరిగిన పరిస్థితి కనిపించింది. సుమారు 200 మంది ఉపాధ్యాయుల ఓట్లు తాము నమోదు చేయించామని, కేవలం 60 మంది ఓట్లు మాత్రమే ఉన్నాయని ఏపీటీఎఫ్ నాయకుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. పాడేరు లోని రెండు పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్వయంగా వచ్చి పోలింగ్ తీరును పర్యవేక్షించారు.ఒక సచివాలయ ఉద్యోగి పోలింగ్ కేంద్రంలో ఉన్నారని కొందరు ఉపాధ్యాయ సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన స్పందించి ఆ ఉద్యోగిని బయటకు పంపించారు.

పాడేరులో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ వివరాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పట్టభద్రుల మండలి ఎన్నికలు అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలో ప్రశాంతంగా ముగిసాయి. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగగా 72.56 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి ఊపందుకుంది. తిరిగి సాయంత్రం కాస్త మందగించింది. అరకువ్యాలీ (149)లో అత్యధికంగా 79.89 శాతం పోలింగ్ జరగగ్గా, చింతపల్లిలో 63.27 అత్యల్పంగా పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. 11 మండలాల వ్యాప్తంగా మొత్తం 11,525 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 7,861 మంది, మహిళలు 3,661 మంది, ఇతరులు 3 మంది ఉండగా, 8362 మంది (మహిళలు 2,411, పురుషులు 5,951) ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాడేరు డివిజన్ లోని పోలింగ్ కేంద్రాల వారిగా పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి. హుకుంపేట (148)లో 68.33, హుకుంపేటలో (148శాతం) 71.38, పాడేరు (153)లో 73.33, పాడేరు (154)లో 73.79, అరకు (149) 79.89, అరకు (150) 73.34, జికె వీధి 78.39, సీలేరు 82.14, డుంబ్రిగూడ 71.49, అనంతగిరి 78.52, పెదబయలు 68.9, ముంచింగిపుట్టు 73.37, చింతపల్లి 63.27, కొయ్యూరు 77.41 జి.మాడుగుల 72.37 శాతం పోలింగ్ నమోదైంది. కొయ్యూరు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి, పాడేరు సుండ్రుపుట్టు పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు వేసినట్లు చూపుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు

అనంతగిరి: స్థానిక బాలికల పాఠశాల వన్ 152 పోలింగ్ బుత్‌లో మహిళలు 140, పురుషులు 357 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ సందర్శించి ఎన్నికల తీరును పరిశీలించారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల-2లో ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8.30 గంటల నుంచి పట్టభద్రుల ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు. స్థానిక ఎస్సై కె.రవీంద్ర పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో 1059 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. 77.37 శాతంగా పోలింగ్ నమోదు అయింది.మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు-2 పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన నెం.146 పోలింగ్ కేంద్రం వద్ద మంచినీటి సదుపాయం కల్పించలేదు. ఓ వైపు మండుటెండ, మరో వైపు టెంట్ ఏర్పాటు చేయకపోవడంతో మండుటెండలో ఓటర్లు క్యూ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. పట్టభద్రురాలైన పాంగి సరోజిని బాలింతరాలు 45 రోజుల పసికందును ఎత్తుకొని మండుటెండలోనే క్యూ లైన్లో నిలబడింది.

పెదబయలు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో ఉదయం 8గంటలకే ప్రారంభమైంది.మండలంలో మొత్తం 1186 ఓట్లకు గాను సాయంత్రానికి 817 ఓట్లు పోలవగా 68.9 శాతం నమోదయ్యింది. పోలింగ్ కేంద్రం వద్ద మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. సుదూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఒంటి గంటకు పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటుహక్కును వినియోగించుకున్నారు. అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ పులి మనోజ్ కుమార్ భద్రత ఏర్పాటు చేశారు. వారపు సంతకు ఒడిశా నుంచి వచ్చిన వాహనాలకు దారి మళ్లించారు.

జి.మాడుగుల:మండలంలో 637 ఓటర్లకు గాను 461 ఓటింగ్‌తో 72శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల ఆఫీసర్ నాగరాజు తెలిపారు.సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

విఆర్ఓకు గుండెపోటు

హుకుంపేట: మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు సోమవారం ఉదయం హాజరైన విఆర్వో అవస్థకు గురయ్యారు. మండలంలో కొట్నాపల్లి పంచాయతీ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న శోభ. వెంకట్ రమణ విధులకు హాజరై సీరియల్ నెంబర్లు ఇచ్చే కౌంటర్లో కూర్చుని ఉన్నారు. గుండెపోటు రావడంతో కూర్చున్న చోటి కుప్ప కూలిపోయారు. గమనించిన పోలీస్ సిబ్బంది, తహసిల్దార్ రాజ్యలక్ష్మిలు 108 కి ఫోన్ చేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో విశాఖపట్నంకు రిఫర్ చేశామని వైద్యులు తెలిపారు.

కలెక్టర్ సందర్శన

హుకుంపేట: మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నిల జోనల్ అధికారి రమేష్ రామన్, పాడేరు సీఐ సుధాకర్ పర్యవేక్షించారు.తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడివో వెంకటరావులు, ఎస్ఐ సతీష్‌లు పర్యవేక్షణ చేశారు.

డుంబ్రిగూడ: మండలంలో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో సుమారు 72 శాతం ఓటింగ్ పోలింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవంతిక సంఘటనలు జరగకుండా అధికారులు పోలీసులతో పటిష్ట చర్యలు చేపట్టారు.

అరకులోయ: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం 7 గంటలకే పట్టభద్రులు క్యూ కట్టారు. అరకులోయ 149, 150 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లు 1819 మంది ఉండగా, వీరిలో 966 మంది పురుషులు, 430 మంది స్త్రీలు మొత్తం 1396 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. ఎండలో క్యూలో నిలబడ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రం లోపల సరిగా లైట్లు ఏర్పాటు చేయలేదని పట్టభద్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ ప్రశ్నించడంతో స్పందించిన తహసిల్దారు పోలింగ్ కేంద్రం వద్ద చిన్న టెంట్ వేశారు.రెండు పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అరకులోయ సిఐ జీడి బాబు, ఎస్ఐ సంతోష్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు నడుమ నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. సబ్ కలెక్టర్ అభిషేక్ పర్యవేక్షణలో పోలింగ్ బాక్స్‌కు సీల్ వేశారు. నోడల్ అధికారి అభిషేక్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ బస్సులో బ్యాలెట్ బాక్సు తరలించారు. చింతపల్లి మండలంలో 1021 ఓట్లు ఉండగా, 646 మంది, జీకే వీధి మండలంలో 384 ఓట్లుగాను 301 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీలేరులో 56 ఓట్లుగా 46 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగాయని సబ్ కలెక్టర్ అభిషేక్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

కొయ్యూరు : మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంపీ గొట్టేటి మాధవి తోపాటు పట్టు భద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు గంటలకు ఒక్కసారిగా రద్దీ పెరిగింది. 664 ఓట్లుగాను 514 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 80శాతం పోలింగ్ నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు మంపై ఎస్సైలు ప్రతిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

వెబ్ కాస్టింగ్‌లో కలెక్టర్ పరిశీలన

పాడేరు: పట్టభద్రుల శాసన మండలి పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ పర్యవేక్షించారు. పాడేరు డివిజన్ పరిధిలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌లో పరిశీలించారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. స్థానిక సుండ్రుపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 153, 154 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు గంటలలోపు పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటర్లు ఓటు నమోదు చేసే వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలని పోలింగ్ అధికారులకు ఆదేశించారు.

3 నెలల పసికందు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన పిహెచ్.దీనా కుమారికి మొదటి కాన్పులో జన్మించిన 3 నెలల పసికందు సోమవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మతి చెందింది. ఆదివారం పసికందు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు పడుతుండడంతో కుటుంబ సభ్యులు తొలిత రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించారు. పిహెచ్ వైద్యాధికారి శ్రీదుర్గా ప్రథమ చికిత్స నిర్వహించి పసికందు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి రిఫర్ చేశారు, అక్కడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం పసికందు మృతి చెందింది. ఊపిరితిత్తుల్లోకి పాలు చేరడంతోనే ఊపిరాడక పసికందు మృతి చెందినట్లు వైద్యులు భావిస్తున్నారు. ఒక పక్క ఉన్నతాధికారులు మాతా శిశు మరణాలు అరికట్టాలని పదేపదే చెబుతున్నప్పటికీ, ఏజెన్సీలో మాతాశిశు మరణాలు ఇటీవల కాలంలో వరసగా జరుగుతున్న నేపథ్యంలో మన్యవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తల్లి ఒడిలో పసికందు మృతదేహం

ధారాలమ్మ జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు

మన్యం ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే ధారాలమ్మ అమ్మవారి 59వ వార్షిక మహోత్సవాలు సోమవారం నుంచి కొత్త అమావాస్య వరకు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా ముహూర్తపు రాటను దేవాదాయ శాఖ అధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం వేశారు. ఈ క్రమంలో అమ్మవారి సన్నిధిలో గరగలు కార్యక్రమంలో ఈవో సాంబశివరావు పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈవో సాంబశివరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18న అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపన, 19 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 21న సాయంత్రం అమ్మవారి ప్రధాన పూజ కార్యక్రమాలు అనంతరం ఆలయానికి తలుపులు మూసివేసి 22 ఉదయం 5:45 గంటలకు అమ్మవారి తలుపులు తెరవబడతాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిపి టి ఈశ్వరరావు, జిల్లా సీపీ కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సీలేరు చేరుకున్న యువకుల సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -సీలేరు

విజయవాడ నుంచి ముగ్గురు యువకులు చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం సీలేరు చేరుకుంది. ఈ సందర్భంగా రవీంద్రరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయాయంలో భాగంగా 50 నుంచి 60 కిలోమీటర్ల వరకు సైకిల్ తొక్కుతామని, ఇందులో భాగంగా సైకిల్‌పై విహారయాత్ర చేస్తున్నామని చెప్పారు. విజయవాడలో శుక్రవారం సైకిల్ యాత్ర ప్రారంభించామన్నారు. ఆదివారం లంబసింగి చేరుకొని అక్కడ ప్రకృతి అందాలను తిలకించామన్నారు. ఆర్వి నగర్, జీకే వీధి ప్రధాన రహదారిలో కాఫీ తోటలు తిలకించి ఎంతో అనుభూతి పొందినట్లు చెప్పారు. ఈ యాత్రలో గౌతమ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బిలావి పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అంతాడ పంచాయతీ పరిధి, కొత్తపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకు ఇళ్లు కాలిపోయినట్లు ఎఎంసి చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, సర్పంచి సుర్ల చంద్రరావు తెలిపారు. ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రీమల శ్రీనివాస్, రాటా మంగకు చెందిన రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయని, ఇంటిలోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు.

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. సోమవారం చింతూరులో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు సున్నం రంగమ్మ అధ్యకతన జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. సమ్మె, యూనియన్, కనీస వేతనం, పని గంటలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తదితర కార్మిక హక్కులపైనా దాడి చేసిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కోత పెట్టిందని పేర్కొన్నారు. మోడీ విధానాల వలన నిరుద్యోగం, ధరలు, పేదరికం, ఆకలి మంటలు పెరిగాయని తెలిపారు. సంపన్నుల ఆదాయం పన్ను తగ్గించిన మోడీ ప్రభుత్వం ఆ భారాలను పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌ల రూపంలో ప్రజలపై వేశారని విమర్శించారు. ఈ విధానాలు వ్యతిరేకిస్తూ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ కార్మికులకు రూ.10 వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అధిక ధరలను అరికట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ ఆపాలని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని, కార్పొరేట్ పన్నులు పెంచాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను అందరికి అందుబాటులోకి తేవాలని తదితర డిమాండ్లతో ఏప్రిల్ 5న ఢిల్లీలో ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, కార్మికులు వెంకటరమణ, అన్నపూర్ణ, సూర్యకుమారి, భద్రమ్మ, రాజేశ్వరి, లలిత, ప్రసన్న, నూకరత్నం, నాగమణి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

సీలేరు చేరుకున్న ఇంటర్ ప్రశ్నాపత్రాలు

పరీక్ష పత్రాలు కారు నుండి దించుతున్న దృశ్యం

ప్రజాశక్తి -సీలేరు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాలు విశాఖపట్నం నుంచి ప్రత్యేక వాహనంలో సోమవారం సీలేరు తీసుకొచ్చారు. వాటిని సీలేరు పోలీస్ స్టేషన్లో సోమవారం సాయంత్రం భద్రపరిచారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ అధికారి కెవి.రత్నం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ, ఎచ్ఇసి గ్రూపుల విద్యార్థులకు ఈనెల 15 నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సెట్-1 పేపర్ ఇంతకుముందే రాగా, సెట్-2, సెట్-3 పరీక్ష పేపర్లు సోమవారం సాయంత్రం వచ్చినట్లు పేర్కొన్నారు. కస్టోడియన్ అధికారి డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏ రోజు ప్రశ్నపత్రాలు ఆరోజు పరీక్ష కేంద్రానికి భద్రత నడుమ తరలిస్తామని తెలిపారు. సీలేరులో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఎటువంటి మాస్ కాపీ జరక్కుండా పకడ్బందీ చర్యలు చేపడతారని వెల్లడించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-చింతూరు : బుధవారం నుండి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చింతూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురాం తెలిపారు. చింతూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. చింతూరు పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 228 మంది, ద్వితీయ సంవత్సరం 234 మంది, ప్రైవేటు విద్యార్థులు 55 మంది పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనీ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, విద్యార్థులు 8 గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

'రెవెన్యూ కార్యాలయంలో అవినీతిని అరికట్టాలి'

ప్రజాశక్తి - ఎటపాక

మండల తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎటువంటి రికార్డులు, ఆధారాలు లేకపోయినా డబ్బు ఇస్తే గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదలాయిస్తున్నారని, అన్ని ఆధారాలున్నా పేదలు, గిరిజనులు మాత్రం కాళ్ళ అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో అక్రమ మట్టి, ఇసుక వ్యాపారాలకు హద్దే లేదన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కనుసన్నల్లో కార్యాలయాన్ని నడిపిస్తున్నారని, కాసులు ఉంటే తప్ప కోర్టు చెప్పినా ఆ కార్యాలయంలో పనులు జరగవని విమర్శించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

స్పందనకు 51 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజలు 51 అర్జీలు అందజేశారు. ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, ఎపిఒ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వై.రామవరం మండలంలోని వివిధ గ్రామాలలో తాగునీటి కోసం వాటర్ ట్యాంకులు నిర్మాణం చేసినా మోటార్లు లేకపోవడంతో తాగునీరు అందలేదని, వెంటనే మోటర్లు ఏర్పాటు చేయాలని ఆ మండల ఎంపిపి కడబాల ఆనంద్, జెడ్‌పిటిసి కె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి వినతిపత్రం అందజేశారు. చింతలపూడి పంచాయతీలోని 770 ఎకరాల భూమికి రబ్బర్ మొక్కలు సరఫరా చేయాలని ఆ గ్రామ సర్పంచ్ పల్లాల సన్నాసిమ్మ, పల్లాల లచ్చిరెడ్డి అర్జీ అందజేశారు. మారేడుమిల్లి మండలం చావడికోట గ్రామంలో గొట్టాలు, మోటార్లు తీసుకురావడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆ గ్రామ సర్పంచ్ సాధల ప్రేమ్ కుమార్ రెడ్డి, బత్తుల టోకు కుమార్ దరఖాస్తు సమర్పించారు. పాలగడ్డ గ్రామం నుండి బొడ్డగండి గ్రామ వరకు సుమారు 18 కిలోమీటర్ల రహదారికి ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేసి మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని సారాంకోట అబ్బాయి రెడ్డి విన్నవించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ అర్జీలకు సంబంధించి వెంటనే పరిష్కరించే వాటిని పరిష్కరించాలని, మిగిలిన సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ బాబు, డిఎస్.శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, నాగేశ్వరరావు, ఎమ్‌డి యూసఫ్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ కోటేశ్వరరావు, ఎండిఎంహెచ్ఒ డాక్టర్ అనూష, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దుర్గాప్రసాద్, రాజేంద్ర బాబు, ఎ.వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి రాంబాబు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, డివిజినల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో అభివృద్ధి ఏమాత్రం కానరావడం లేదని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. మండలంలోని డివి.కోట గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేష కుమార్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నెత్తిన పన్నులతో భారం వేస్తుందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతుందన్నారు. ఏజెన్సీలో సరైన రహదారి సౌకర్యాలు లేవని, గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడితే ఆసుపత్రికి వెళ్లేలోపే మధ్య దారిలో పురుడు వస్తుందని పేర్కొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు శేష కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, నిలదీసిన వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత, రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సుభాన్, అరకు పార్లమెంట్ బీసీ నాయకులు డి.జనార్ధన్, తీగల ప్రభ, జిఎం వలస ఎంపీటీసీ కొరగాని సువర్ణరాజు, నాయకులు అందాల సూర్యనారాయణ రెడ్డి, పాము రాంబాబు, తెలుగు యువత నాయకులు మండా రత్నాజీ, రాము, ఎరుబండి రాంబాబు, కత్తుల బంగారు రెడ్డి, కత్రం సోమరాజు, బట్ట లచ్చిరెడ్డి, సంకూర్ పెంటమ్మ, సాదల సత్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

కొయ్యూరులో ఓటేసిన ఎంపీ మాధవి



అరకులోయలో బారులుదీరిన ఓటర్లు

ముంచంగిపుట్టులో భారీగా ఓటింగ్‌లో పాల్గొన్న పట్టభద్రులు

పెదబయలులో ఓటేయడానికి వచ్చిన పట్టభద్రులు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 11,525 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 7,861 మంది, మహిళలు 3,661 మంది, ఇతరులు 3 మంది ఉండగా, 8362 మంది (మహిళలు 2,411, పురుషులు 5,951) ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.56 శాతం పోలింగ్ నమోదైంది.కొయ్యూరు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి, పాడేరు సుండ్రుపుట్టు పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డీశ్వరి పాడేరులో పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.కలెక్టరేట్ నుంచి పోలింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ పర్యవేక్షించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

పటిష్ట భద్రత మధ్య సీలేరు పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సుల తరలింపు

హుకుంపేటలో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విశాఖలో ఓటేసిన ప్రధాన అభ్యర్థులు కోరెడ్ల రమాప్రభ (పిడిఎఫ్), సుధాకర్ (వైసిపి), చిరంజీవిరావు(టిడిపి)

ముంచంగిపుట్టులో ఓటేసిన బాలింత

బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది

జి.మాడుగులలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల భద్రత

విశాఖలో ఓటేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, బి.గంగారావు

గాజువాక పోలింగ్ కేంద్రం వద్ద పిడిఎఫ్ శిబిరంలో నర్సింగరావు

రాంబిల్లిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న లోకనాథం, సుధాకర్

ఓటేయడానికి వస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

మంత్రి ఉషశ్రీని తొలగించాలి

ప్రజాశక్తి పాడేరు: పశ్చిమ రాయలసీమ నియోజక వర్గంలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున బహిరంగంగా డబ్బు పంపిణీ చేస్తున్న ఉష శ్రీచరణ్‌ను రాష్ట్రమంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనర్స డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బహిరంగంగా మంత్రి ఉషశ్రీ చరణ్ వ్యవహరించిన తీరు ఈ ఎన్నికల్లో గెలుపు కోసం అధికార వైసిపి సాగిస్తున్న అక్రమాలకు పరాకాష్టని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు వెల్లడించారు.

29 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: సుండ్రుపుట్టు రామాలయంలో ఈనెల 29, 30, 31 తేదీలలో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాలను పురష్కరించుకొని సోమవారం ఉదయం రామాలయం వద్ద ముహూర్తపు రాట (పందిరి రాట)ను వేశారు. భక్తులు, మహిళలు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు డిపి సురేష్, జవ్వాది బాబురావు, సిహెచ్ గోపాల్, బి.బాలయ్య, డిపి సంతోష్, శేషు, జె.భాను ప్రసాద్, శ్రీహరి, ట్రైసన్, భాస్కర్, వెంకట్, శ్రీరాములు, కోటి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు.స్థానిక హుకుంపేట పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ పోలింగ్ కేంద్రంలో పరిశుభ్రత చేయక పోవడంతో పాటు ఎన్నికల విధుల నిర్వహణలో గైర్హాజరయ్యారని ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదని ఎండిడివో వెంకట్రావు, తహశీల్దార్ రాజలక్ష్మి కలెక్టర్ సుమిత్ కుమార్ కు పిర్యాదు చేశారు.

20 నుంచి రాసకొండమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామ సమీపంలో రాస కొండమ్మ తల్లి జాతర ఈనెల 20వ తేదీ నుండి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని సర్పంచ్ ఎల్ మాలన్న, ఎంపీటీసీ ఎల్.అప్పలరాజు, మాజీ సర్పంచ్ టి రాంబాబు తెలిపారు. కీర్తిశేషులు వైస్ సర్పంచ్ టి గజపతిరాజు జ్ఞాపకార్థంతో భారీ ఎత్తున క్రికెట్, వాలీబాల్ టోర్నమెంటు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

టిటిడి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని టిటిడి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం స్వరూపనందేంద్ర సరస్వతి, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు ఈ సందర్భంగా స్వరూపనందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ, సముద్ర సాక్షిగా స్వామివారిని ఇక్కడ ప్రతిష్టించి సోమవారం నాటికి సంవత్సరం అయిందని తెలిపారు. సింహాచలం అప్పన్న ప్రతి రూపంగా ఇక్కడ స్వామి భక్తులకు దర్శనమిస్తున్నారని తెలిపారు.

టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు రానున్న రోజుల్లో జమ్మూ కాశ్మీర్, శ్రీకాకుళం జిల్లా సీతంపేట, అల్లూరి జిల్లా రంపచోడవరంలో వెంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్మిస్తామని తెలిపారు.

సింహగిరి రైల్వే కాలనీలో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : తాటిచెట్లపాలెంల సమీపంలోని సింహగిరి రైల్వే కాలనీని వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ అనుప్‌కుమార్ సత్పతి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కాలనీలోని సౌకర్యాలను పరిశీలించేందుకు సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఎస్‌కె.సారంగి, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలోని ప్రాథమిక సౌకర్యాలు, పారిశుధ్యం, భద్రత, రైల్వే క్వార్టర్ల పరిస్థితిని మెరుగుపరిచేందుకు వీక్షించారు. కాలనీలోని ఉద్యోగుల కుటుంబాలతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఇళ్లను పరిశీలించి పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డిఆర్ఎం మాట్లాడుతూ, ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం, ఇళ్ల స్థితిగతులను తెలుసుకోవడం, సౌకర్యాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవడమే తనిఖీల ఉద్దేశమన్నారు.

16 నుంచి గీతంలో ఐఇటిఇ సాంకేతిక ఉత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఇటిఇ) ఆధ్వర్యాన జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం "ఐస్క్వేర్ ఆర్-2023" నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ జెబి.సెవెన్త్‌లైన్ తెలిపారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులతో పాటు వర్క్‌షాపు, సాంకేతిక ప్రసంగాలు 16, 17 తేదీలలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సాంకేతిక ఉత్సవం నేపథ్యంలో రహదారి భద్రతపై వాక్‌థాన్, ఫ్లాష్ మాబ్‌లను నిర్వహించామని పేర్కొన్నారు. దాదాపు 200 మంది విద్యార్థులతో జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ ఎస్.నీరజ, డాక్టర్ పి.రాజు, కెవి.సత్యకుమార్, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేను జయప్రదం చేయండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాషా

గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని చింతలవీధి, గుడివాడ, కుమ్మరిపుట్‌లోని గురుకుల బాలికల పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి భాషా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 14న జరిగే నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు ఏ విధంగా ఉపయోగించాలో? ఏ వయసు వారికి ఏ విధంగా ఇవ్వాలనేదానిపై అవగాహన కల్పించారు. అంగన్వాడి సెంటర్లలో బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైతే జిల్లా ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందేలా చూడాలని ఆయన సూచించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు 7 గ్రామ్స్ కంటే బ్లడ్ తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి పౌష్టికారం అందే విధంగా చూడాలని చెప్పారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్న పిల్లలను అరగంట వరకు అబ్జర్వేషన్‌లో ఉంచాలని, ఎటువంటి దుష్ పరిణామాలు జరిగినా వెంటనే స్థానికంగా ఉన్న ఆరోగ్య సిబ్బందికి తెలియ చేయాలన్నారు. పిల్లలు వేడి నీరు తాగాలన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతోపాటు హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు పాల్గొన్నారు.

అందరి చూపూ రెండో ప్రాధాన్యత వైపే

- ఆ ఓటుతో గట్టెక్కేదెవరు ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓటు ఎంతో కీలకం. ఈ ఓటే విజేతనూ నిర్ణయిస్తుంది. సోమవారం జరిగిన మండలి ఎన్నికల్లో వైసిపి, తెలుగుదేశం, బిజెపి, పిడిఎఫ్ అభ్యర్థుల చూపులు పోలింగ్ అనంతరం రెండో ఓటుపైనే పడ్డాయి. ముఖ్యంగా అధికార పార్టీ వైసిపి తొలి ప్రాధాన్యత ఓటుపైనే కేంద్రీకరించి ఆ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసింది. మరోపక్క తెలుగుదేశం పార్టీకి మొదటి ఓటు వేసిన కొంతమంది, వైసిపిలోని కొంత మంది పిడిఎఫ్ గెలవాలని కోరుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఇరుపార్టీల నుంచీ రెండో ప్రాధాన్యత ఓటు పిడిఎఫ్‌కు లభించే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంతటా చర్చ నడుస్తోంది. 2024 సాధారణ ఎన్నికలకు ఈ మండలి ఎన్నికలు సెమీ ఫైనల్స్ అంటూ అధికార వైసిపి ప్రకటన చేసినా ఆ దిశగా పట్టభద్రులెవరు అడుగులేసిన దాఖలా కానరావడం లేదు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీని నిలువరించకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎదుర్కొనడం కష్టమనే భావన తెలుగుదేశం పార్టీ ఓటర్లు గుర్తించారన్నది తెలుస్తోంది. బిజెపికి మొదట ఓటు వేసిన వారిలో కొందరు టిడిపికి రెండో ప్రాధాన్యత ఇచ్చినట్లు వినికిడి.

ఓటేసిన ప్రముఖులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సోమవారం జరిగిన శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖకు చెందిన పలువురు రాజకీయ నేతలు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని బూత్ నెంబర్ 245లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కృష్ణా కాలేజీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ దండు బజార్ వద్ద ఉన్న ఎంవిడిఎం స్కూల్‌లో ఓటు వేశారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అక్కిరెడ్డిపాలెంలోని జెడ్పి హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్ ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్లోని 248 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి వి.చిరంజీవిరావు ఆంధ్ర యూనివర్సిటీలోని రూమ్ నెంబర్ 123లో ఓటు వేశారు. వీరితోపాటు బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావులు ఎంవిపి కాలనీ గిరిజన భవన్ వద్ద ఏర్పాటు చేసిన 225 పోలింగ్ కేంద్రంలో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ పోలింగ్ బూత్ 244లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఓటు వేశారు. ఎయు హైస్కూల్‌లోగల 248 పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఓటు వినియోగించుకున్నారు. జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. సంఘంలో ఇటీవల ఖాళీ అయిన పోస్టులను ఎన్నికల ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ఎలక్షన్ కన్వీనర్ ఎంఎన్‌ఎస్‌ఎస్.సింగ్ ఆధ్వర్యంలో ఈ ఖాళీ పోస్టుల ఎన్నిక ప్రక్రియ జరిగింది. అందులో భాగంగా అసోసియేషన్ అధ్యక్షులుగా ఎం.దేవేశ్వరరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా జి.ఉమామహేశ్వరరావు యథావిధిగా కొనసాగనున్నారు. ఉపాధ్యక్షులుగా పి.ప్రసన్న కుమార్, దీప్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఎలక్షన్ కన్వీనర్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అధికారుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేయాలన్నారు.

'నాటు నాటు' విజయోత్సవం

- ఆస్కార్ అవార్డు రావడంతో విశాఖలో సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించిన సందర్భంగా సోమవారం సాయంత్రం డైమండ్ పార్క్ సమీపంలోని ఓ హోటల్‌లో వైజాగ్ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, సినీ డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేశారు. సినీ ఎగ్జిబిటర్, పశ్చిమ ఎమ్మెల్యే పిజిఆర్.నాయుడు (గణబాబు), మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఉత్తమ పాటగా ఆస్కార్ అవార్డు సొంతం చేసుకొని భారతీయ సినీ చరిత్రలో అపూర్వ ఘట్టానికి తెరతీసిందని కొనియాడారు. దేశం గర్వించదగ్గ ఇంతటి ఘన విజయాన్ని సాధించిన చిత్ర దర్శకుడు రాజమౌళి, స్వరకర్త కీరవాణి, గీత రచయిత చంద్రబోస్ అభినందనీయులని కొనియాడారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భేషరతుగా విరమించుకోవాలని మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం నాయకులు ఈసరపు లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 709వ రోజుకు చేరాయి. దీక్షలలో మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. నేటి వరకూ ఉపాధి లభించని నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను నిర్వాసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.జయమ్మ, ఎన్.లక్ష్మి, ఆర్.కళావతి, ఇ.రాము, టి.ఆదమ్మ, పి.పారమ్మ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

లా పెరోస్ విన్యాసాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బహుపాక్షిక యుద్ధ విన్యాసాల్లో భాగంగా లా పెరోస్ - 2023 మూడో ఎడిషన్ సోమవారం ప్రారంభమైంది. ఈ విన్యాసాలు మంగళవారమూ కొనసాగనున్నాయి. వీటిని హిందూ మహా సముద్ర ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పాల్గొనే నౌకాదళాల మధ్య సముద్ర డొమైన్ అవగాహనను మెరుగుపరచడంతో పాటు సముద్ర సమన్వయాన్ని ఆప్టిమైజ్ చేయడమే లక్ష్యంగా ఈ విన్యాసాలు సాగనున్నాయి. రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ, ఫ్రెంచ్ నేవీ, ఇండియన్ నేవీ, జపనీస్ సిబ్బంది, మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్, రాయల్ నేవీ, యునైటెడ్ స్టేట్స్ నేవీ నౌకలు, హెలీకాప్టర్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. సముద్ర కార్యకలాపాల నూతన ప్రణాళిక, సమన్వయం, సమాచార భాగస్వామ్యం ప్రధాన అంశాలుగా ఈ విన్యాసాలు సాగనున్నాయి. భారత నావికా దళం నుంచి స్వదేశీయంగా నిర్మించిన గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఫ్లీట్ ట్యాంకర్ ఐఎన్ఎస్ జ్యోతి ఈ ఎడిషన్‌లో పాల్గొంటున్నాయి.

కేంద్రకారాగారంలో అధికారులకు కార్యశాల

ప్రజాశక్తి - ఆరిలోవ : బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, మినిస్టరీ ఆఫ్ హోమ్ ఆఫైర్స్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ కేంద్రకారాగారంలో 'స్టేక్ హోల్డర్స్ కో-ఆర్డినేషన్ అండర్ లీడర్‌షిప్' అంశంపై జైళ్ల శాఖ అధికారులకు కార్యశాల నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యశాలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మేఘాలయ, హిమాచల్‌ప్రదేశ్ నుంచి వివిధ హోదాల్లో ఉన్న 21 మంది అధికారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికారులకు శిక్షణ అనేది అన్ని శాఖలలో ఒక భాగం అని, దీని ద్వారా కొత్త విషయాలను తెలుసుకొనుటకు దోహద పడుతుందని తెలిపారు. మొదటి రోజైన సోమవారం క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, టీం బిల్డింగ్ స్కిల్స్ వంటి అంశాలపై అసోసియేట్ డీన్ నందిని, వి.సతీష్ చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

16న ఐటిఐలో స్కిల్ కనెక్ట్ డ్రైవ్

ప్రజాశక్తి -కంచరపాలెం : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐలో పిఎంకెవివై 4.0లో భాగంగా 18-45 సంవత్సరాల మధ్య వయసు వారికి శిక్షణ, ఉద్యోగం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వ తేదీన స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారికి స్కిల్ పెంపొందించేలా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేళాకు అర్హత సర్టిఫికెట్లతో 16వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9908799126 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.